# సౌందర్యభావం!

పురాణపండ రంగనాథ్

"డజను పాతిక రూపాయలా? ఇవేం బంగారం నారింజ పళ్లటయ్యా? పైగా ఇది నారింజ పళ్ల సీజన్. ఎక్కడపడితే అక్కడ గుట్టలుపోసి అమ్ముతున్నారాయె. ఇంకో మాట చెప్పు"-

ఆ పళ్ల దుకాణంవాడితో వసంత బేరం మొదలుపెట్టింది.

"తీసుకుంటే తీస్కోండి లేదంటే వెళ్లండి అవతల బోలెడు మంది ఫారిన్ వాళ్లున్నారు" షాపువాడు విసుక్కుంటున్నాడు.

వసంత వెనక్కు చూసింది. నిజమే విదేశీయులు జంటలుజంటలుగా అక్కడి దుకాణాల దగ్గర తిరుగుతున్నారు. కొందరు పళ్లు, బొమ్మలు పూసలదండలు కొంటున్నారు. వూరు చిన్నదే అయినా జనసందోహం వల్ల పెద్ద వూరులా అనిపిస్తోంది.

"ఇది చిన్న పల్లె అనుకొన్నా యిక్కడ కూడా యాత్రికులే, రేట్లు పెంచేశావు" అంది వసంత. ఆ మాట షాపువాడు విన్నట్టున్నాడు.

"ఇది సీజనమ్మా! ఈ రెండు నెలలు జనం బాగా వస్తారు" షాపువాడి ముఖంలో విసుగుదల వున్నా మాటమాత్రం నెమ్మదిగానే అన్నాడు. వసంత ఎలాగైనా ఆ పళ్లు కొనాలని తాపత్రయ పడుతోంది. ఆమె ఆంతర్యాన్ని కనిపెట్టిన వసంత భర్త రాంకుమార్ యిలా అన్నాడు.

"ఇది సీజన్ అంటున్నాడు కద తెములు"

"మీరుండండి మనుషుల సీజనే కాదు; నారింజపళ్ల సీజన్ కూడా యిది. మరీ యింత హెచ్చు ధరా?" వసంత నారింజపళ్లలో నాణ్యమైన వాటిని ఏరుతోంది.

"కొంటేనే ఏరండమ్మా లేదంటే కాయపై చేయి వేయవద్దు" షాపువాడు హెచ్చరికగా అన్నాడు. మనిషిచేసే నాణ్యం ఎన్నికకు నారింజలు కమిలిపోయి ఆకర్షణ తగ్గిపోతాయని అతడి భయం.

"నేనేం జలగని కానయ్యా రసం పీల్చేయడానికి. ఇంత ధరపోసి కొంటుంటే రసం బాగున్న కాయలు ఏరుకోవాలిగా?" అంది వసంత ఆరు నారింజకాయల్ని ఏరి బ్యాగ్‌లో వేసుకొంటూ. రాంకుమార్ పర్సులోంచి డబ్బు తీసి షాపువాడికి యిచ్చాడు. సంచి సర్దుకుని ఆ దంపతులు వెనుదిరిగేలోపల అక్కడకు విదేశీ దంపతులు యిద్దరు వచ్చారు. ఆ విదేశీ అమ్మాయి జీన్‌ప్యాంట్ వేసి, షర్ట్ టక్ చేసింది. ఆమె ఎత్తు గుండెలు మగాళ్ల చూపుల్ని లాక్కుంటున్నాయి. అలాంటి ఫారిన్ అమ్మాయిల్ని చూసినప్పుడు వసంతకి ఇబ్బంది అనిపిస్తుంది. పైట వేసుకుని చీర కట్టుకునే సంప్రదాయం వాళ్లకి ఎందుకు రాలేదో అని వసంత ఆలోచిస్తుంటుంది. ఇంతలో ఆ ఫారిన్ అమ్మాయి మాటలు వినిపించి వసంత అటువైపు చూసింది.

"ఆరంజెస్ డజన్ ట్వెంటీఫైవ్. వెరీచీప్ ఎనీహౌ వుయ్ డోంట్ కమ్ టు ఖజురాహో టు బై ఆరంజెస్" అని ఆ యువతి బాగ్‌లోంచి యాభై రూపాయల కాగితం తీసి షాపువాడికి యిచ్చింది. వాడు యిరవై యిచ్చి అయిదు రూపాయలు లేవన్నాడు. 'కీపిట్' అనేసి ఆ ఫారిన్ యువదంపతులు అక్కడనుంచి కదిలారు.

"వీళ్లకి డబ్బు లెక్కలేదు. ఇంకో రెండు కాయలు తీసుకోవచ్చుగా" వసంత చురచురలాడుతూ అంది.

"నువ్వు డబ్బు గురించి ఆలోచిస్తున్నావ్ కాని ఆ పిల్ల అన్న మాటలు వినలేదు" రాంకుమార్ అన్నాడు.

'ఏం అన్నదట?' వసంత దీర్ఘంగా అంది.

"ఖజురాహోకి నారింజపళ్లకోసం రాం అంది" అన్నాడు రాంకుమార్.

'మరెందుకట?' వసంత ఉక్రోషంగా అంది.

'ఎందుకేమిటి? ఇక్కడి అద్భుత శిల్పాల్ని చూసేందుకే వస్తాం అని అర్థం. పద మనమూ అందుకే వచ్చాం" రాంకుమార్ అడుగు ముందుకువేశాడు.

"మేడమ్ ఈ మహాదేవి విగ్రహం చాలా బాగుంటుంది ఒకటి కొనుక్కోండి" అని చిన్న చిన్న ప్లాస్టర్ ఆఫ్ పారిస్ బొమ్మల్ని అమ్మే కుర్రాడు వసంత నడకకి అడ్డుపడ్డాడు.


ఆమె మొదట వద్దని అంది. ఆ కుర్రాడు అడిగిన తీరుకు అతడి చేతిలోని ఆ బొమ్మల అందానికి ఆకర్షితురాలై కొంది. బేరం ఆడలేదు. రాంకుమార్‌కి ఆశ్చర్యం వేసింది.

"బేరం ఆడకుండానే కొనేశావే" అని వరిహాసం ఆడుతూ ఆ కుర్రాడికి పది కాగితం యిచ్చాడు. వాడు చిల్లర యివ్వబోయాడు. వసంత తీసుకోవద్దంది. రాంకుమార్ ముసిముసిగా నవ్వుతూ ముందుకు అడుగువేశాడు. వసంత ఆ బొమ్మని బ్యాగులో జాగ్రత్తగా అమర్చుకుంది. అతనిని అనుసరించింది.

"మొత్తానికి మీ ఆడవాళ్లు భలేగమ్మత్తుగా వుంటారు. నారింజపళ్లు బేరం ఆడావు. ఆ ఫారిన్ అమ్మాయి షాపువాడికి డబ్బులు వదిలేసిందని నువ్వు వీడికి చిల్లర వదిలేశావు" అని భర్త చేసిన పరిహాసానికి వసంత మూతి ముప్పైవంకర్లు తిప్పింది తప్ప మాట్లాడలేదు.

"ఇప్పుడు మనం కందరొాయ మహాదేవాలయం చూడడానికి వెళ్తున్నాం" అని రాంకుమార్ కొంచెం వేగం పెంచాడు. ఇద్దరు పిల్లల తల్లి అయిన వసంత అతనితో సమాన వేగంతో నడవాలని ప్రయత్నం చేస్తూ ఆయాసపడుతోంది.

"ఏమిటో పెళ్లయిన కొత్తలో చేయవలసిన యాత్రలు ఇప్పుడు చేస్తున్నాం. ఇంటి దగ్గర పెద్దపిల్ల, పిల్లాడు ఎలా



వున్నారో?" అంది ఒకచోట కొంచెంసేపాగి అలసట తీర్చుకుని మరల కదులుతూ.

"మన వయసేం అయిపోలేదు. పెళ్లయి ఆరేళ్లేగా అవుత. అయినా ఖజురాహో చూస్తే యవ్వనం మళ్లీ వస్తుందట. పద చూస్తే నీకే తెలుస్తుంది" రాంకుమార్ ఆమెను ఉత్సాహపరచాలని అన్నాడు.

ఖజురాహో అన్ని దేవాలయాల దగ్గరా పూలూ, అగరువత్తులూ అమ్ముతారు.

'ఖజురాహో' పేరు ఆమె వింది. అది విచిత్రం అనిపించింది. అయినా రాంకుమార్ అది ఒక తీర్థయాత్ర కేంద్రం అని నమ్మించాడు. జీవితంలో ఒక్కసారైనా ఆ ఆలయాన్ని చూసి రావాలని అన్నాడు. వసంత నమ్మింది. తీరా ఇక్కడకు వచ్చాక ఆమె అంచనాలూ, వూహలూ రాంకుమార్ చెప్పిన మాటలు తారుమారైనాయనిపించింది. అయినా ఇక్కడిదాకా వచ్చేశాక ఆ ఆలయాల్ని అద్భుత శిల్పాల్ని చూడక తప్పదుకద. చూడకుండా వెళ్లడం మూర్ఖత్వం అనిపిస్తుంది. అందుకే ఆమె భర్త వెంట ఆసక్తి, అయిష్టం, విముఖత కలగలిసిన భావాలతోనే బయలుదేరింది. ఆ ఆలయాల్ని 950-1000 సంవత్సరాల మధ్యకాలంలో చందేలీ రాజులు నిర్మించారు.

అప్పట్లో అది గొప్ప పట్టణం. ఈనాడు చిన్న పల్లెగా, ఒక విహార కేంద్రంగా మారిపోయింది. మొత్తంమీద 85 ఆలయాలు నిర్మించబడినాయట. నేడు ఇరవై మూడు ఆలయాలు మాత్రమే దర్శనీయ స్థలాలుగా మిగిలినాయి. విచిత్రం ఏమిటంటే ఇక్కడ శిల్పాలలో పది శాతం మాత్రమే శృంగార భంగిమల శిల్పాలు. అయినా ప్రేక్షకుడిలో ఖజురాహో ఒక శృంగార శిల్పకళాకేంద్రం అని ముద్ర వేయిస్తాయి.

వసంత రాంకుమార్ దంపతులు మార్తాండేశ్వరాలయం దగ్గరకు వచ్చారు. ఖజురాహోలో అది ఒక్కటే నిత్యపూజలు జరుగుతున్న సజీవ ఆలయం. మిగిలినవి మృతప్రాయంగా వున్న శిల్పాభిరామాలు. మార్తాండేశ్వరలింగం చాలా పొడవైంది. అక్కడి పూజారి అర్థం కాని మంత్రాలతో ముద్ద మాటలతో పూజ చేస్తున్నాడు. మంత్రోచ్చారణ ఆంధ్రప్రాంతం పురోహితులే బాగాచేస్తారు. ఉత్తరాది పురోహితుల మంత్రోచ్చారణ ఎబ్బెట్టుగా వినిపిస్తోంది.

భార్యాభర్తలిద్దరూ శివలింగం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నప్పుడే అంతకుముందు నారింజపళ్లు కొన్న ఫారిన్ యువ దంపతులు కనిపించారు. వాళ్లిద్దరూ అలా నిలిచిపోయి ఎనిమిది అడుగుల పొడవైన ఆ శివలింగాన్ని కన్నార్పకుండా చూస్తున్నారు.

'ఎంత పెద్దదో?' అతడు ఆశ్చర్యంగా అన్నాడు. ఆ విదేశీయుడి మాటలకు పూజారి పొంగిపోయాడు. వసంత దంపతులకిచ్చినట్లుగా కాక మరింత శ్రద్ధగా వారికి ప్రసాదం ఇచ్చాడు. ఆ దంపతులు రెండు పదిరూపాయల నోట్లు పళ్లెంలో వేశారు.

ఆ ఫారిన్ యువతిలో విచిత్రమైన అందం వుంది. ఆమె కదలికలో ఏవేవో శిల్ప భంగిమలున్నాయి. ఆమె శరీరం పాలరాతి వలె తెల్లగా వుంది. పెదాలు ఎరగా వున్నాయి. జీన్‌పాంట్ బిగుతుగా

ఇన్నేళ్ల తర్వాత మరల ఇప్పుడు ఈ శృంగార ఆలయంలో విదేశీ ఆడపిల్ల కనిపించగానే రాంకుమార్ దృష్టి అటు మరలుతుందని, అతడి ఆలోచనలు ఆవైపు పయనిస్తాయని ఆమె అనుకుంది.

వుండటం వల్ల ఆమె అందాలు సొగసుగా కనిపిస్తున్నాయి. తన భర్త ఆమెనే చూస్తున్నాడు అని పసిగట్టిన వసంతకి పెళ్లైన కొత్తలో తన భర్త చెప్పిన మాటలు గుర్తుకువచ్చాయి.

"వసూ, యూరప్ ఆడపిల్లలు మహా తెల్లగా వుంటారు. వాళ్ల పర్సనాలిటీ కూడా మన ఆడపిల్లల్లా కాదు. వాళ్లు పొడవుగా వుంటారు. నాజూకుతనం మాట ఎలా వున్నా కలువుగోరుతనంగా వుంటారు. నిజంగా ఇండియా యూరప్ దేశాలు దూర్పు పడమరలే. భౌగోళికంగానే కాదు స్వభావాలలో, స్వరూపాలలో" అని భర్త చాలాసార్లు తన గర్ల్‌ఫ్రెండ్ గురించి వర్ణిస్తూ చెప్పేవాడు. అంటే అతనికి మన ప్రాంతపు చామనఛాయ, వసువు తెలుపు కలగలసిన శరీర వర్ణంకన్నా విదేశీ ఆడపిల్లల శరీర ఛాయలే ఇష్టం అన్నమాట అనిపించేది.

ఇన్నేళ్ల తర్వాత మరల ఇప్పుడు ఈ శృంగార ఆలయంలో విదేశీ ఆడపిల్ల కనిపించగానే రాంకుమార్ దృష్టి అటు మరలుతుందని, అతడి ఆలోచనలు ఆ వైపు పయనిస్తాయని ఆమె అనుకుంది. అనుకోవడమేమిటి రాంకుమార్ కూడా ఆ విదేశీ యువతి తెల్లటి చర్మాన్నే ఆబగా చూస్తున్నాడు.

'ఇంక వెళదాం'- అని వసంత వేగంగా అడుగులేసింది. ఈసారి రాంకుమార్ ఆమెను అనుసరించాడు. వారిద్దరికీ ఆ విదేశీ యువతి ఏదో యూరోపియన్ భాషలో అంటున్న మాటలు వినిపించాయి.

"ENTSCHULDIGENSIE BITTE"

"అంటే?" వసంత అడిగింది. ఆమె ఏం బదులు చెప్పలేదు.

"క్షమించండి అని" రాంకుమార్ చెప్పాడు.

ఆ మాటలు అంటూ ఆ విదేశీ యువ దంపతులు వసంత దంపతుల్ని దాటి ముందుకు వెళ్లిపోసాగారు.

"SPRECHENSIE DEUTSCH" అని అమ్మాయి అన్న మాటలు కూడా వారికి వినిపించాయి. రాంకుమార్ ఆ పిల్ల నడకలోని హొయల్ని చూస్తున్నాడు. ఆమె దూరం అవడంతో వసంత నిట్టూర్చింది.

"వాళ్లు జర్మన్‌లు, ఫ్రాంక్‌ఫర్ట్‌నుంచి వచ్చారు. నేను ఫ్రాంక్‌ఫర్ట్‌లో వున్నప్పుడు ఇలాంటి మాటలు వినేవాడిని అన్నాడు భార్యతో.

"అంటే" అడిగింది వసంత.

"మీరు జర్మన్ భాష మాట్లాడతారా?" అని అడిగింది. వీళ్లకి కళలూ శిల్పాలు అంటే మహా ఇష్టం. ఇండాలజిస్టులు అయివుంటారు. ప్రస్తుతం భారతదేశ దేవాలయాల గురించి అధ్యయనం చేస్తున్నట్టున్నారు రాంకుమార్ అంటున్నాడు.

"వాళ్ళు పెళ్లి చేసుకొన్నారంటారా?" వసంత ప్రశ్నించింది.

"చేసుకుని వుండరు" వాళ్ల జీవిత విధానాలూ, మన సంప్రదాయాలూ వేరు వేరుగా వుంటాయి." రాంకుమార్ మాటలు ఏదో స్వప్నలోకంలో వున్నట్టున్నాయి. అతను తన పాత జర్మన్ స్నేహితురాల్ని తలుచుకున్నాడనుకుంది వసంత. ఏదో మాట్లాడబోయింది. ఆమెకు ఆ అవకాశం ఇవ్వకుండా రాంకుమార్ "రా తిరిగివద్దాం" అని తన చేతుల్లోని గైడ్‌బుక్ చూశాడు. ఏదో అభిప్రాయానికి వచ్చాడు.

** ** **

వసంత, రాంకుమార్ లక్ష్మ ఆలయం దగ్గరకు వచ్చారు. రాంకుమార్ గుడి లోపలకు ప్రవేశించబోయాడు. ప్రదక్షిణకు ఉపక్రమించాడు.

"ప్రదక్షిణ చేశాక లోపలకు వెళ్లి క్షమాపణగా దర్శనం చేసుకుందాం" రాంకుమార్ ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని ప్రదక్షిణ ఆరంభించాడు.

ఆ ఆలయం గోడల మీద మొదటి శిల్పాలు చూశాక వసంత గొంతు మూగబోయింది. తర్వాత విరుచుకుని పడింది.

"ఛీ, ఛీ ఇవేం బొమ్మలు. ఇదేం గోల. సిగ్గూ శరం లేదు. పైగా దేవాలయం గోడలపై బూతుబొమ్మలా?" అని ఛీత్కరించింది. ఆమె తిరస్కార భావానికి రాంకుమార్ పగలబడి నవ్వాడు.

'ఎందుకు నవ్వుతున్నారు?'

"ఇవేం నీకు కొత్తకాదు కదా?" అని ఒక శృంగార భంగిమ శిల్పాన్ని చురీ పట్టి పట్టి చూపించాడు. అతని మాటలకి, చేష్టలకి ఆమె స్థాణువైంది.

"చాల్లెండి. నవ్విపోతారు" అని కోపంగా చూసింది. ఇంతలో ఒక యాత్రికుల జంట అటు వచ్చారు. వారి అలికిడి విని వసంత మరి మాట్లాడలేదు. ఆ దంపతులు విదేశీయులే. అమెరికన్ అయి వుంటారు. వాళ్ళు వయసులో పెద్ద వాళ్ళు. భర్త ఆలయ శిఖరం చూడాలని తాపత్రయ పడుతున్నాడు. ఆ శిఖరాన్ని ఫోటో తీయాలని



యాంగిల్ కోసం తపనపడుతున్నాడు. అతని పక్కనేవున్న మధ్య వయస్కురాలైన భార్య మెడలో కళ్లజోడు వేలాడుతోంది. చూసినవారికి భుజాన వాటర్ బాటిల్ కనబడుతోంది. అది పెద్దదిగా వుంది. అంచేత వాళ్లని దాటుకుని వెళ్లడానికి వసంత దంపతులకు కష్టం అయింది. రాంకుమార్ పెదవి విప్పేలోగానే వసంత చొరవచేసి "ఎక్స్‌క్యూజ్‌మి" అంది. ఆ అమెరికన్‌వాళ్లు 'సారీ' అన్నట్లు నిశ్శబ్దంగా పెదాలు కదిపి దారి ఇచ్చింది. వసంత, వెనుక రాంకుమార్ వెళ్తుండగా ఆ అమెరికన్ మహిళ అంది.

"నేను మాటల్లో చెప్పలేదు. మీ భారతీయులకు జీవన రహస్యాన్ని బతుకు సర్వస్వాన్ని మౌనంగా వివరించే ఒక మతం ఉంది" ఆమె మాటల అంతరార్థం రాంకుమార్‌కి తెలిసినంతగా వసంతకి తెలీలేదు. అతను మార్మికంగా నవ్వాడు.

"ఆ ఆలయంపైవున్న ఆ దేవుడి బొమ్మని ఫోటో తీయాలని ప్రయత్నిస్తున్న మీ దారికి అడ్డం వచ్చాం" అన్నాడు ఆ అమెరికన్.

"అతడి పేరు శివుడు. అతని చేతిలోని ఆయుధం పేరు త్రిశూలం. అతడు లయకారకుడు' అని రాంకుమార్ వివరించాడు.

'భలే వింతగా వుందే?' అంది ఆ అమెరికన్ మహిళ.

** ** **

వసంత దంపతులు ఆ దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఖర్జూర వాహక అనే పేరుగల ఒకనాటి పట్టణం ఈనాడు ఖజురహో అయింది. 'ఖర్జూర' అనే సంస్కృత పదానికి తేలు అని అర్థం. ఇక్కడి ఒక దిగంబర శిల్పం తొడపై తేలు బొమ్మ వుంటుంది. అదే ఖర్జూర వాహక శిల్పం.



ఆలయం చుట్టూ తిరుగుతున్నవారికిప్పుడు ఆ బూతు బొమ్మల ధ్యాస అంతగా లేదు. ఆ శిల్ప విన్యాసపు నిమ్నోన్నతాలవైపు వెనుక గల శిల్పుల వ్యధిత గాథలు బోధలు, బాధలు ఏవో బొమ్మలవలె వారి మనో భూమికలపై తారాట్లాడుతున్నాయి. మరీ శృంగార భంగిమ శిల్పాలు కనిపించినట్లు వసంత బలవంతంగా కళ్లు మూసుకుంటోంది. గర్భాలయంలో ప్రవేశించేసరికి ఆమె శరీరం అంతా తప్పు భావనతో చెమటతో ఆర్ద్రం అయిపోయింది. గర్భగుడిలోని నరసింహస్వామి బృహత్ విగ్రహం ముందు నిలిచి ఆమె క్షణకాలం కళ్లుమూసుకుంది. తప్ప ఏ ప్రార్థనా చేయలేదు. తనకోసం ఏమి అడగలేదు.

అక్కడ విరిగిన దేవాలయాలమీది బొమ్మలు మరీ శృంగారమయంగా వున్నాయి. ఆ భంగిమల్ని ఆమె భరించలేకపోయింది. దూరంనుంచి గ్రంధరీయ మహా దేవాలయం మాత్రం చాలా గంభీరంగా వున్నతంగా, మహోన్నత సందేశస్ఫోరకంగా కనిపించింది. కాని ఈ ఆలయం మీది శిల్పాలు అచ్చం మానవుల వలె వున్నాయి. జీవవంతంగా, జ్వలయంగా వున్నాయి. చుట్టూ ఎందరో స్త్రీ పురుషులు తిరుగుతుండగా ఆ మిథున శిల్పాల్ని తదేకంగా ఎక్కువగా ఎవరూ

**ఆ మిథున శిల్పాల అవిరామ రతి భంగిమల్ని శృంగార ముద్రల్ని ఎక్కువసేపు చూడడం ఇష్టంలేక వసంత మాత్రం కొంచెం పక్కగా వెళ్లి ఆ పరిసరాలలో అందంగా కనిపిస్తున్న పొదల్ని చూడసాగింది**

చూడలేరు. అక్కడి ఒక గైడ్ ఆ మిథున శిల్పాల గురించి చక్కగా వివరిస్తున్నాడు. విన్నవారు అతడికి డబ్బులు ఇస్తున్నారు. కొందరు అతడిని ప్రశ్నలు వేస్తున్నారు. కొందరైతే ప్రశంసించి వెళ్లిపోతున్నారు.

"ఈ ప్రార్థనాలయం మీద ఈ శృంగార శిల్పాలు ఏమిటని మీరు ప్రశ్నించవచ్చు. ఇందుకు ఆసక్తికరమైన ఒక సిద్ధాంత సమాధానం వుంది. ప్రాచీన భారతీయులకు అన్ని విషయాల్లోనూ క్రియావాదులు. క్రియాశీలురు. కొత్తగా పెళ్ళి అయిన వారికి ఉపయోగించే దాంపత్య జీవితపు విశేషాలు చెప్పే అచ్చు పుస్తకాలు ఆనాడు లేవు. అందుకే ఈ దేవాలయాలు సెక్స్ విద్యాబోధనా కర్తవ్యాన్ని నెరవేర్చాయి. ఇది ఒక పవిత్రకర్తవ్యం అని ఆనాటి వారు భావించారు" అని గైడ్‌మందహాసం చేశాడు. అతడి మాటలు విన్న అందరికన్నా తక్కువగా అక్కడ చేరిన నవ దంపతులు మరిమరి సిగ్గుని అభినయించి కదిలిపోయారు.

ఆ మాటలు వింటున్న మధ్య వయస్కులైన సింధీ దంపతులపై వసంత దృష్టి పడింది. వాళ్లు ఆ మిథున శిల్పాల్ని చూస్తూ ఒకరినొకరు ఆకలిగా చూసుకోవడాన్ని వసంత పసికట్టింది. ఆ సింధీ మహిళ బాగా స్థూలకాయురాలు. వయస్సుకి మించిన పెరుగుదలతో ఒంటిమీది కండరాల్ని ఆమె పాలియెస్టర్ చీరలో బంధించలేకపోతోంది. ఆమె భర్తకి బట్టతల. వున్న వెంట్రుకలలో ఒకటి రెండు నెరుస్తున్నాయి. అయినా వాళ్లిద్దరూ అలా చూసుకోవడం వసంతకి ఎబ్బెట్టుగా అనిపించింది.

'ఛ.. ఛ...' అనుకుంటూ దృష్టి మరల్చింది. అక్కడే ఒక హిప్పీ పద్మాసనం వేసుకొని ధ్యానముద్రలో వున్నాడు. అతడి ఎదురుగా ఒక పెద్ద నగ్నశిల్పం వుంది. అతను మాత్రం కళ్లు మూసుకుని యోగ సమాధిలో వున్నట్టున్నాడు. వసంత ఆ పరిసరాల్ని తదేకంగా చూస్తున్న సమయంలోనే రాంకుమార్ అక్కడి ఒక అద్భుత దిగంబర శిల్పాన్ని ఫోటో తీశాడు. ఒక అందాల యువతి కాలిపాదాలకు గోరింట అలుముకొంటున్న దిగంబర శిల్పమది.

ఆ మిథున శిల్పాల అవిరామ రతి భంగిమల్ని శృంగార ముద్రల్ని ఎక్కువసేపు చూడడం ఇష్టంలేక వసంత మాత్రం కొంచెం పక్కగా వెళ్లి ఆ పరిసరాలలో అందంగా కనిపిస్తున్న పొదల్ని పచ్చికబీళ్లని చూడసాగింది. ఆమె దగ్గరకు ఒక తమిళ మహిళ వచ్చింది. కచ్చాపోసి కట్టిన చిలకాకుపచ్చ రంగు చీరతో ఆమె మధ్య వయస్కురాలుగా వుంది.

"మీరెక్కడ నుంచి వచ్చారు?" వసంత పక్కన కూర్చుంటూ ఆవిడ అడిగింది.

"ఆంధ్ర" వసంత అంది.

"అది తెలుస్తూనే వుంది. ఏ వూరని?"

"బెజవాడ దగ్గర చిన్నవూరు"

"మీవారేం చేస్తుంటారు?"

"బిజినెస్"

"ఉద్యోగం కాదన్నమాట?"

"కొన్నాళ్లు ఉద్యోగం చేశారు. తర్వాత మానేసి వ్యాపారం మొదలెట్టారు. ఆయన ఫారిన్‌లో చదువుకున్నారు."

"ఉద్యోగాలకన్నా వ్యాపారం నయం. మావారు వింటేనా! లెక్చరర్‌గానే జీవితం లాగిస్తున్నారు. ఆయనకిలాంటి యాత్రలంటే చాలా యిష్టం" అని ఆ అరవావిడ దూరంగా చూపింది. అక్కడ లుంగీ, జుబ్బా వేసుకుని నలుగురైదుగురు పిల్లలతో ఆ ఆలయాలు చూ(సి)స్తున్న ఆయన కనిపించారు.

"వాళ్లు ఆయన విద్యార్థులు" అందా అరవావిడ.

"అవ్వ, ఈ బూతు బొమ్మల్ని వాళ్లకి చూపిస్తున్నారా? పైగా టీచరైవుండి" వసంత ఆశ్చర్యంగా అంది.


ఆ అరవావిడ భళ్లున నవ్వేసింది. ఆ తర్వాత ఇద్దరూ కబుర్లలో పడ్డారు. ఇద్దరికీ ఖజురాహో శిల్పాల పట్ల అంత సదభిప్రాయం లేదని మాటల వల్ల ఉభయులూ గ్రహించారు. అంతలోనే అరవావిడ భర్త కేకవేశాడు. ఆవిడ లేచి ఆరిందాలా అడుగులు వేస్తూ వెళ్లిపోయింది. వసంత ఆలోచిస్తూనే చూస్తోంది. ఇంతలో వారు అంతకుముందు చూసిన జర్మన్ యువతీ యువకులు ఒక జీపులో రయ్‌న వెళ్లడం కనిపించింది.

** ** **

ఆలయాలు చూస్తున్నప్పుడు ఒక ఆలయం నుంచి మరొక ఆలయం వైపు వెళ్లేటప్పుడు పరిచయమైన యాత్రికులందరూ ఇప్పుడు భోజనాల దగ్గర హోటల్‌లో కనిపిస్తున్నారు. సింధీ ఆవిడ పరోటాలు లాగించేస్తోంది. జర్మన్ యువతీ యువకులు నాన్‌వెజ్ ఆర్డరిస్తున్నారు. అరవ దంపతులు తాము తెచ్చుకున్న తినుబండారాల్ని పులిహోర పాకెట్లని విప్పి తింటున్నారు. విద్యార్థులు కూడా వారి దగ్గర వున్నారు. అందరూ ఆబగా భోజనం చేస్తూనే ఖజురహో ఆలయాల నిశ్శబ్ద సందేశాన్ని నెమరువేసుకొంటూ కనిపిస్తున్నారు.

'భోజనాలయ్యాక విశ్రాంతి తీసుకుందాం' అన్నాడు రాంకుమార్.

"వద్దు చూడవలసిన ఆలయాలు ఇంకా వున్నాయి" అంది వసంత తన



చేతిలోని ఖజురహో గైడ్‌బుక్‌ని తిప్పుతూ.

"నీ ఇష్టం" ఆశ్చర్యంగానే ఆమోదాన్ని తెలిపాడు రాంకుమార్.

గోధుమచేల వెంట జైన దేవాలయాలకు నడిచి వెళ్లారు. ఆ సమయంలో ఆమె భుజాలపై, నడుముపై చేయి వేసి నడవాలని రాంకుమార్ ప్రయత్నించాడు. వసంత ఏమనుకొందో తమకు వెనుకా ముందూ యాత్రికులు నడుస్తున్నా లక్ష్య పెట్టక భర్త స్పర్శకి అవకాశాన్ని ఇచ్చింది. తాను కూడా అతడి నడుం చుట్టూ చేయి వేసింది.

జైనాలయం గోడలకి వున్న అద్భుత శిల్పాలవైపు ఇద్దరూ కళ్లార్పకుండా చూస్తున్నారు. అది చక్కగా మలచిన శిల్పం. అవయవాలు పొందికగా వున్నాయి. సమానమైన కొలతలతో మలిచిన శిల్పం అది. ప్రేయసీ ప్రియులు ఒకరినొకరు తమకంగా తన్మయంగా చూసుకొంటున్నారు. ఎన్ని శతాబ్దాల నుంచి వారలా నిరీక్షిస్తున్నారో దగ్గరగా వుండికూడా తృప్తి తీరని తనువులు వారివి.

ఇతర దేవాలయాలపై శిల్పాలవలెనే అది మిథున శిల్పమే. వసంత ఆ శిల్పాన్నే చూస్తూ భర్తకి మరింత దగ్గరగా జరిగింది.

హఠాత్తుగా ఆ ఆలయ ప్రాంగణం అంతా నిశ్శబ్దం ఆవరించింది. కొన్ని సెకన్ల క్రితం వినిపించిన ధ్వని ఏదో ఇప్పుడు వినరావడంలేదు. అదేమిటో? అని వసంత ఆలోచించసాగింది.

కత్తులకు పదునుపెట్టే యంత్రంచేసే చప్పుడువలె వుంది ఆ శబ్దం. అంటే ఎవరో దేనినో కోస్తున్నారు. రంపంతో రాతిని కోస్తున్నారు. రాతిని చదునుచేసే సానపెట్టే ధ్వనివలె వుంది. ఈ రెండురకాల విచిత్ర ధ్వనులు ఒకదాని తర్వాత మరొకటి వినిపించాయి. ఇప్పుడు హఠాత్తుగా నిలిచిపోయాయి. సరిగా అదే నిమిషంలో రాంకుమార్ వసంతను తన బాహుపంజరంలో బంధించాడ. ఆమె కొంచెం తిరస్కారంగా అతని నుంచి దూరం అయింది. అంతలో ఒక విదేశీ యువతి మాటలు వినిపించాయి.

"ఆ శిల్పం మీపై ప్రభావాన్ని ప్రసరించింది"

రాంకుమార్, వసంత ఆ అమ్మాయి వైపు అదోలా చూసి గబగబ అటుయిటు కదిలిపోయారు.

'సారీ, నేను మిమ్మల్ని డిస్టర్బ్ చేశాను' ఆ విదేశీ అమ్మాయి క్షమాపణ చెప్తున్నట్లు అంది. వసంత ఆమెవైపే ఆశ్చర్యంగా చూసింది.

"మీ ఇద్దరు అచ్చం ఆ శిల్పాలవారిలాగానే వున్నారు. నిజంగా... ప్రేయసీ ప్రియురాళ్లు భార్యాభర్తలు మాలాగా కాదు" ఆ పిల్ల మాటలలో అసంతృప్తి వినిపించింది. ఆ విదేశీ యువతి తన ముక్కుని జేబురుమాలుతో తుడుచుకుంది. ఆమె ముక్కు ఎర్రగా వుంది. కళ్లు పూదారంగులో వున్నాయి. అవి ఆర్ద్రమయినట్లున్నాయి.

"మా పాశ్చాత్య దేశాల్లో నిజమైన ప్రేమ లేదుతెల్సా. నా ఫ్రెండ్ వున్నాడు వాడు నన్ను ప్రేమించడు. నా ఒంటితో ఆడుకొంటున్నాడు. మేం యూరప్ వెళ్లగానే వాడు నన్ను మరచిపోతాడు" ఆ విదేశీ యువతికి దుఃఖం పొంగి పొరలి వచ్చింది.

ఆమె వ్యధతో కళ్లు మూసుకుంది. అప్పుడు తన భర్త విదేశీ స్నేహితురాలి గురించి వసంతకి గుర్తువచ్చింది. ఆమె కూడా ఇలాగే ఏడ్చి వుంటుంది అనుకుంది. అంతలోనే తనని తాను సంబాళించుకొని వసంత ఆ యువతి భుజాలపై చేయివేసి 'ఏడ్వకమ్మా' అని సముదాయించింది.

** ** **

ఈసారి ఆ ధ్వని ఇదివరకటికన్నా వేగంగా వినిపించింది. లోహాన్ని లోహంతో రాపాడించిన ధ్వని. రాతిపై లోహపు పరికరాన్ని రాపాడించిన శబ్దం. వసంత ఆ యువతి భుజంపైనుంచి చేయితీసివేసి తన భర్తకోసం అటూఇటూ చూసింది. ఆ విదేశీ యువతి ఆమెకు మరింతగా హత్తుకుపోయింది.

"ఇక్కడ ఇంక చూసేవి ఏంలేవు" ఆ ధ్వని స్పష్టంగా వినిపిస్తోందికద. అది ఘంటాయ్ దేవాలయం నుంచి వస్తున్న శబ్దం. మీరా ఆలయాన్ని తప్పక చూడాలి" ఆ విదేశీ యువతి వసంతని తొందర పెట్టింది. ఇద్దరూ అటూయిటూ చూశారు. రాంకుమార్ అంతలోనే వారి దగ్గరకు వచ్చేశాడు.

"హో ఫైన్. మీ మిసెస్ కోసం చూస్తున్నారు. మీరావిడ్ని ఘంటాయ్ దేవాలయానికి తీసుకువెళ్లండి. అక్కడ అన్నీ పూలూ, గంటలే. చాలా బాగుంటుంది. పైగా నదీతీరాన వుంది. అక్కడ మీ ఏకాంతాన్ని భంగపరిచేవారెవరూ వుండరు" అని ఆ విదేశీ యువతి గుక్క తిప్పుకోకుండా అంది.

రాంకుమార్, వసంత మరి మాట్లాడకుండా ఆ గుడివైపు అడుగులు వేశారు.

"రైట్ ఆ పక్కగా తిరిగితే ఆ గుడి కనిపిస్తుంది" అని ఆ యువతి చేతివేలితో సూచించి వారు కొంచెం దూరం వెళ్లగానే పకపక నవ్వసాగింది.

"పిచ్చిదేమో?" అంది వసంత. రాంకుమార్ ఏం మాట్లాడలేదు. ఇద్దరు నడక సాగించారు.

వాళ్లకి తెలీకుండానే వాళ్లు అక్కడకు వచ్చేశారు. అది చిన్న ఆలయం. శిథిల స్థితిలో వుంది. స్తంభాలకు గంటలు వేలాడుతున్నాయి. అవీ శిలా నిర్మితాలే.

ఆలయానికి దూరంగా దిగువన నది ప్రవహిస్తోంది. నదీతీరం వెంట వున్న బురదనేలల్లో కొంగలు, సారస పక్షులు చేపల్ని వేటాడుతున్నాయి. అదొక మౌన నిసర్గం. ప్రకృతి దృశ్యం. వారిద్దరి వెంట ఇద్దరు ముగ్గురు పేద పిల్లలు ఆలయం వద్దకు వచ్చారు. వారిలో పదకొండేళ్ల బాలిక ఆకర్షణీయంగా వుంది. ఆ పిల్లని అంటిపెట్టుకొని పొట్టి పిల్లవాడొకడున్నాడు. వాడు కుడిచేతి బొటనవేలును నోటిలో పెట్టుకుని చీకుతున్నాడు.

'అరె గుడిలో మూలవిరాట్ లేదే? ఏమైందో?' అని ఆశ్చర్యంగా చూశాడు రాంకుమార్.

'ఈ మూల విరాణ్మూర్తికి ఆత్మగౌరవం ఎక్కువై వుంటుంది. అందుకే ఈ బూతుబొమ్మల మధ్య వుండలేక పారిపోయి వుంటాడు" అంది వసంత. ఆమె మాటలకు రాంకుమార్‌కి నవ్వు వచ్చింది. ఆమె నదికి ఆవలివైపునకు చూసింది. అక్కడ ఒడ్డున పెద్ద దట్టమైన అడవివుంది. అక్కడే సీతారాములు అరణ్యవాసంలో కొంతకాలం గడిపినట్లు చెప్తుంటారు. ఆ ఒడ్డున సారసపక్షుల విన్యాసాలు చూడముచ్చటగా వున్నాయి.

రాంకుమార్ ఆత్రంగా అక్కడి మూలవిరాట్ తొలగించబడిన ప్రదేశంమీద అరచేతితో తడిమాడు. అంతవరకు మౌనంగా, ఆశ్చర్యంగా చూస్తున్న బాలుడు నోటిలో వేలు తీసేసి "వాళ్ల ఆ విగ్రహాన్ని ఎత్తుకుపోయారు" అన్నాడు అప్రయత్నంగా. వాడి అప్పగారు వాడి చెంప ఛెళ్లుమనిపించింది. అయినా లక్ష్యపెట్టక "వాళ్లే విగ్రహాన్ని విరక్కొట్టేశారు. పట్టుకుపోయారు" అని అరుస్తున్నాడు.

'ఎవరూ?' రాంకుమార్ ఆశ్చర్యంగా అడిగాడు.

ఆ పిల్లాడు ఈసారి ఏం మాట్లాడక జైనాలయంవైపు వేలుని చూపాడు.

'వాళ్లు మోటారు కారులో పారిపోయారు. అక్కయ్యకు పది రూపాయలు ఇచ్చారు" అన్నాడు ఆ బాలుడు. ఆ పిల్ల వాడి చెవి మెలిపెట్టి లాక్కుపోయింది. వాడు ఏడుస్తూనే వున్నాడు.

రాంకుమార్ ఆ ఆలయంలో భగ్నం అయిన శిల్ప భాగాన్ని, మూలవిరాట్ నిలిచివుండే ప్రదేశాన్ని మార్చిమార్చి చూశాడు.

"ఆ విదేశీపిల్ల పిచ్చిదికాదు పెద్ద మోసగత్తె. అదే ఈ విగ్రహాల్ని పట్టుకుని పోయి వుంటుంది" అంది వసంత పళ్లు కొరుకుతూ.

"సరేలే, ఆ సారస పక్షుల్ని చూడు జీవనానందాన్ని ఎలా అనుభవిస్తున్నాయో" అన్నాడు. రాంకుమార్ మిథున క్రీడలో నిమగ్నమైన ఆ పక్షి జంటని చూపుతూ.

వసంత భర్త భుజాలపై తన్మయంగా వాలిపోయింది.

ఘంటాయ్ ఆలయం స్తంభం మీది రాతి గంటల్ని ఎవరో మోగిస్తున్నారు. ఖజురాహో శిల్పాకృతుల ఆత్మవేదన ఆ గంటల చప్పుడులో వినిపిస్తోంది.

**ఖజురాహో ఆలయ సముదాయాల మౌన ప్రాంగణం కాదు. అది వేలాది మంది శిల్పుల, కళాకారుల కళాభిమానుల ఆత్మ నివేదన. ఒక దేశపు మార్మిక సంస్కృతీ ప్రతీక. ఎన్నో ఆశల నిరాశల ఉచ్ఛ్వాస నిశ్వాసాల నిశ్శబ్ద ధ్వని. అది అద్భుత స్వప్నాల ఉలి శబ్దం.** ●